# హృదయం ★

రచన :
"ఫల్గుణ"

'రండాగర్భము వంటిచిక్కు దెన
సంప్రాప్తించె మీ యయ్యకున్.'

సరిగ్గా పరిస్థితి అలానేవుంది. మహా అయోమయముగా ఉంది. ఏమీ పాలుపోలేదు. ముందు నుయ్యి వెనుక గొయ్యి లాంటిదిగాదు. అది దీనికన్నా చాలా నయం. ముందు వెనుక, రెండే ప్రమాదదిశలు. ఆఫ్‌కోర్సు ముందుకు వెళ్లలేకపోయినా, వెనక్కుతిరిగి రాలేక పోయినా. కొంచెము బుర్ర ఉపయోగిస్తే ఏటో ఒకప్రక్కకు తప్పుకుని పోవచ్చును. కాకపోతే పారిపోవచ్చును.

ఇది అలాంటిది ఎంతమాత్రము కాదు. ముందూ వెనుకా క్రిందా మీదా ప్రక్కలకూ అన్న భేదమేలేదు. దశ దిశలనుండీ ప్రమాదయే. ఎటుప్రక్క కాస్త వంగి "ఊ...." అంటే మిగిలిన ప్రక్కలన్నీ మీద పడిపోతాయి. పోనీ! అలాగని ఎటూ కదలకుండా నిశ్చలముగా ఉండడానికి కూడా వీలులేదు. తను కదిలితీరాలి. ఐతే! ఎటూ....? అన్నదే తేలనినమస్య.

వలలోపడిన జంతువులను వల అన్నివైపులా మట్టివేసి అణువణువునా బంధించివేసినప్పుడు. కదలడాని కవకాశం లేనందువల్ల పారిపోలేకా, రాబోయే ప్రాణాపాయ భీతిచేత ఉండలేకా పడే అవస్థ.

ఆలోచనలమీద ఆలోచనలతో తల వేడెక్కిపోతోంది. ఒకరుకాదు ఇద్దరు కాదు; ఒక్కసారి ఆరుగురు. అందరూ తను లేకపోతే వీలులేదనేవారే, గాని తనుమాత్రం. ఎంత వైభవంగా చేసుకున్నా, ఎంతడబ్బుఖర్చుచేసినా, ఎంత మంది బంధువులు స్నేహితుల నాహ్వానించినా, ఎన్నిఆడంబరాలుపెట్టుకున్న, పెళ్ళిచేసుకోగలిగింది ఒకే! ఒక్కదానిని! మాత్రమే! మిగిలిన ఐదుగురి సంగతి.? అదే ఈ తేలనినమస్య.

పద్మ, రాధ, మాలతి, స్వర్ణ, కమల, లక్ష్మి, ఈఆరుగురూ చదువుకున్నవాళ్లే. తనక్లాసువాళ్ళేను. అందరూ ధనవంతులబిడ్డలే. అందరికి స్వంత మేడ లున్నాయి. అందరిళ్లకి టెలిఫోను లున్నాయి. రాధ, కమల వీళ్ళిద్దరికి కార్లుకూడా ఉన్నాయి.

పద్మజ, తనుగాని లేకపోతే తాను బ్రతకలేననీ, తాను ఆత్మహత్య చేసుకుంటానంటుంది. తనకి విపరీతమైన గౌరవము ఇస్తుంది.

రాధ, స్వతహాగా తెలివైంది, నిండుకుండలా గంభీరమైనహృదయం. తొణకదు. తమపేర్లు రాధ మురళి సరిగా కుదిరాయని సంతోషిస్తుందీ. మురళి మీద అభిమానంలో తన స్వంత అవుసరాలనుగూడ మరచిపోతుంది.

మాలతి, తనకి కాస్త జ్వరంవస్తే అది తగ్గేవరకు ఏకధారగా ఏడుస్తుంది. తను గాని అన్యాయముచేస్తే నూతిలో పడి పోతానంటుంది.

స్వర్ణకుమారి, సహజముగా గంభీర హృదయ. మురళి లేకపోతే తనకు జీవితమే లేదంటుంది. మురళికోనం ఎన్నిఅవునరాలైనా మానేస్తుంది.

కమలకుమారి, అభిమానం అంతా ఇంతా అనడానికి వీలులేదు. మనిషి అమాయకురాలేమో ప్రతిదానికి బెంబేలు పడుతుంది. మురళికోనము ఎంత ఖర్చుపెట్టడానికైనా ఆలోచించదు. మురళిని ఎన్నిరకాలుగా ఆకర్షించుకోగలదో అన్నిరకాలుగా ప్రయత్నిస్తుంది. మురళి అన్యాయముచేస్తే సముద్రంలో పడిపోతానంటుంది.

అనంతలక్ష్మి, అలంకారమూ, ముస్తాబూ ఆఖరికి చీరెలుగూడ మురళికిష్టమైనవే. ఏదైనా ఒకరంగు మురళి మెచ్చుకుంటే మర్నాడు ఆ రంగుచీరెతో మురళికి కన్పిస్తుంది.

ఈ ఆరుగురి మధ్యని చిక్కి, ఆరుగురికి కావలసివచ్చిన ఒకే, ఒక్కడు మురళి. గాని తనకుమాత్రము ఈ ఆరుగురు సమానమే. ప్రత్యేకమైన అభిమానము ఏ ఒక్కరిమీదాలేదు. అలాగని, ఇటువంటి సమయములో తెలివిగా తప్పించుకుని వేరే ఇంకెవరినో చేసుకోలేడు. వీరిలోనే ఎవరో ఒకరు కావాలి. పోనీ ఇప్పట్లో మానేద్దామనడానికి వీలులేదు. తన తలిదండ్రులు ఈ సంవత్సరాంతములో పెళ్లి జరిగి తీరాలంటున్నారు. ఒక్క సుగుణం. అమ్మాయిని చూసుకునేబాధ్యత తనకే వదిలేసారు. అదే! తలమునిగి తాటి ప్రమాణముగా తయారైంది.

పరిస్థితి ఇంతవరకూవచ్చి ఈ విధముగా పరిణమిస్తుందనుకోలేదు. చిన్న తరగతులనుండి తనకి ఆరుగురు సహాధ్యాయినులే. రానురాను కాలేజీవదిలే నాటి కిలాగైంది.

ఈ సమస్య సాధారణముగా తేలేది గాదు. తాను ఏదైనా స్వయంగా చేయాలి. కొంతవరకు సాహసించాలి. ఇదే ఆఖరి కతనికి స్ఫురించిన ఊహ. ఒక చిన్నపరీక్ష కల్పిస్తే అందులో అసలు హృదయము తెలుస్తుంది. మామూలు పరిస్థితుల్లో అంతా అభిమానిస్తున్నారు. నిజానికి ఏ ఒక్కరి అభిమానమూ సామాన్యమైనది గాదు.

మెఱుపులాంటి ఆలోచన వచ్చి పడింది. అవును; దీనిలో తనకు జవాబు దొరకడము, మిగిలినవారికి తనపై విపరీతమైన కోపంరావడం జరుగుతుంది. మరునాడు ప్రొద్దున్న సరిగా ఏడున్నరకు, అనగా ఆ సమయములో అంతా ఇళ్లదగ్గరుంటారు. అదేసమయానికి తన ఇంటందరూ శివాలయానికి బయల్దేరారు. తనచెల్లెలు శైలబాలను ఇంట్లో ఆపేశాడు.

వరుసగా ఆరుగురికి మారుపేరుతో ఫోనుచేసాడు. తాను మురళి స్నేహితుడననీ, హఠాత్తుగా గుండె ఆగడము వలన మురళి ఇప్పుడే మరణించాడనీ ఇంట్లోనే అంతాఉన్నారనీ దాని సారాంశము.

శైలకు చెప్పవలసినదంతా చెప్పి తాను వీధివరండా గదిలో కిటికీదగ్గర కూర్చున్నాడు. రోడ్డు తనకు స్పష్టంగా

కన్పించేలాగున్నా, తనుమాత్రం బైటికి కనుపించనట్లుగా తగు జాగ్రత్త తీసుకున్నాడు.

ఝూ మంటూ ఒకరిక్షావచ్చి ఆగింది. రిక్షాలోంచి గెంతి చేతిలోడబ్బులు రిక్షావాడికి పడేసి ఒక్కపరుగులో లోపలికెళ్లిపోయింది అనంతలక్ష్మి. ఎంత గాభరాగావచ్చిందో ఆమె అవతారమే చెప్తుంది. తలా చీరె కానలేదు. ఏకధారగా ఏడుస్తుంది,

ఆగిన రిక్షాలోనుంచి బాణములా దూసుకుని ఇంట్లోకెళ్లిపోయిందిమాలతి. రిక్షావాడి డబ్బులగోల ఆమె నాకర్షింపలేకపోయింది. ఆమె దుఃఖముచూస్తే తనకు నిజముగా జాలివేసింది. చాటుగా పిల్చి రిక్షావాడికి డబ్బులిచ్చి పంపించేసాడు.

అడ్డదిడ్డముగా కారాపితీసిన తలుపు సరిగా పడలేనిదికూడా గమనించకుండ లోపలి కెళ్లిపోయింది కమలకుమారి. ఐతే దానిధర్మమా అంటూ ఇంజను మాత్రము ఆపింది. డ్రైవరులేందే కారెక్కనిది, డ్రైవరునుపిల్చే టైముకూడా లేకపోయింది.

రిక్షా ఆగకమునుపే క్రిందకు గెంతేసింది పద్మజ. ఆ తొందరలో సరిగా కట్టుకొనని చీరె కుచ్చెళ్లు కాళ్ళల్లోపడి రోడ్డుమీద పడిపోయింది. గభాలున లేచి పరిగెత్తింది. అంతకన్నా వేగంగా రిక్షావా డడ్డుకున్నాడు. వాడిని వదిలించుకుంది.

కారు ఆగగానే దిగి నలుప్రక్కలా చూచింది. కొంచెం ఆశ్చర్యపోయింది రాధ. డ్రైవరును కారులో ఉండమని చెప్పి లోపలికెళ్లింది. చాటుగాచూస్తున్న మురళి ఆశ్చర్యపోయాడు. ఆమెపెద్దగా ముస్తాబుకాలేదు గాని ఐనంతమట్టుకు జాగ్రత్తగానే తయారైంది. ఎవరిచావుకూ ఆమెగాభరాపడదు. ఇంతకన్న ఉద్దండపిండము స్వర్ణ. నవ్వుకున్నాడు. వీళ్లిద్దరికీ కనీసం వాళ్ళ స్వంతచావునాడైనా కాస్త గాభరా ఉంటుందా అని.

ఇంకో అరగంట అలానే కూర్చున్నాడు. వీళ్ళంతా ఒకపది, పదిహేను నిముషాల్లో వచ్చేసారు. గాని అరగంట ఆలస్యము, మొత్తము గంట దాటిపోయినా స్వర్ణకుమారి రానేలేదు.

అప్పుడు ఆశ్చర్యము కొద్దిగా వేసింది. హృదయములో ఎంత గాంభీర్యత ఏడుస్తున్నా కనీసం సానుభూతి చూపడానికి రాలేదు, అని. అందులో ఇంకొకరు, ఇంకొకరుగాదు. తాను పెళ్లిచేసుకుందామని ఇన్నాళ్లూ విర్విళ్లూరి, కలలు కన్న వ్యక్తి హఠాత్తుగా కన్నుమూసాడంటే! ఆపాటి సానుభూతికూడా లేకపోయిందేమా అని. బ్రతికివుంటే ఏమైనా అయేవాడు, గాని ఎలాగూ ఐపోయాడు. ఇక వాడినిచూసి ఫలితము మాత్రము ఏముంటుంది? అన్నంతవరకు పోయిందన్నమాట, వీళ్ళ గంభీరతత్వం, నిశ్చలత్వం, వల్లకాడూను. ఎంతస్వార్థం? ఛీ....అనుకున్నాడు.

నెమ్మదిగా లోపలికెళ్ళాడు. లోపలవాళ్లందర్నీ మనిషి కొకమారు చెప్పి ఇప్పుడే వస్తాడంటూ శైలబాల కూర్చోబెట్టింది. గాని ఆ శీను బ్రహ్మాండముగా ఉంది.

చూడగానే ఖస్సుమంటూ లేచింది లక్ష్మి. 'మురళీ నువ్వింత వంచకుడు, మోసకాడు అనుకోలేదు.' గౌరవముగా మీరు అనడము పోయింది. 'కోరి.... అనేసరికి ఇలానే అంటుంది. నీలాంటి వాళని కుక్కలకన్నా కనికష్టంగా చుట్టూ తిప్పుకోవాలి. నేనే అనుకుని హృదయం ఇవ్వబోయినందుకు మంచి పాఠము నేర్పావు. వెనకాతల ఇంత మంది ఉన్నారని తెలిసిందిగాదు. నీ సెలక్షను ధర్మమా అంటూ ఈ నాడైనా కళ్ళువిప్పాను. బ్రతికుండగా నాముఖం చూడ్డానికి ప్రయత్నించకు' అంటూ జవాబుకోసమైనా చూడకుండా పోయింది. అంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు.

మాలతికళ్ళు ఎర్రగా ఐపోయాయి. 'ఏమండీ మీరు ఇలాంటి పరీక్షలంటూ అవాంతరాలుతెస్తే నేను బ్రతుకలేను. ఇపుడు ఇందులో మీకు తేలిందేమిటి? మీకు పుణ్యము ఉంటుందిగాని ఇలా వెర్రెత్తించవద్దు.'

పద్మజముఖము అంతా కన్నీటిలో తడిసిన వెంట్రుకలు అంటుకపోయి ఉన్నాయి. సరిగా దువ్వుకోలేదేమో చిన్నరకము భూతములా ఉంది తల. "ఎంత గాభరాపెట్టేశారండీ? మీ రు మరీను! రిక్షాదిగినప్పుడు రోడ్డుమీద పడిపోయాననుకుంటాను. గదూ....?" అందరివంకా చూసింది. "అవును" అంది శైలబాల. తను నవ్వుకున్నాడు మురళి. "ఏదైనా! మీరు ఏదో తేల్చుకోవాలిగాని, ఇలా హడలగొట్టడము నాకేమీ బావుండలేదు. ఐతే ఇంతమంది ఉన్నారన్నసంగతి తెలీదు."

కమలముఖములో కోపము ఉడుకుమోత్తనము కనుపిస్తున్నాయి. "స్త్రీకి ఒక్కభర్త ఎలాగో, పురుషుడికిగూడ భార్య ఒక్కటే ఉండాలి. అంతేగాని కనిపించినవాళ్లందరి వెనుకపడేవాడి వెనుకపడ్డానేమిటా అని విచారిస్తున్నాను. స్త్రీలంటే అంత కుక్కమురికిగా కనుపిస్తునా? ఏమిటీ బోడిసెలక్షను కర్థం? ఇదేమైనా సర్వీసుకమిషనా? పాడా? మీ సెలక్షను పూర్తిచేసుకున్న నాడే కనిపించండి. అదీ....నా అవసరము ఉంటేనే...." అంటూ చరచరా వెళ్లిపోయింది.

రాధ నిశ్చలంగాచూస్తుం దందర్నీ. "మీరేసెలక్షననుకున్నా, ఏమనుకున్నా ఫర్వాలేదు. ఏదో ఒకలాగు బాగున్నారు. అంతేచాలు. దీన్ని ఆధారముగా మీరేమి నిర్ణయించ తల్చుకున్నారో నా ఊహ కందలేదు. వీళ్లందరూ అన్న సంగతి నాకూడాతెలీదు. ఏది ఏమైనా అందర్నీ పరీక్షించి ఆమీదట నన్ను చేసుకుంటే నాకన్నా అదృష్టవంతు లీ ప్రపంచములో ఉండరు. నాకది గర్వకారణముకూడాను. కనిపిస్తూంటారు గదూ?" అంటూ లేచింది. అంతా సాగిపోయారు.

శైలబాల అన్నవంక ఆశ్చర్యముగా చూసింది. మురళి వెళ్లిపోతున్నవాళ్ల వంక సాభిప్రాయముగా చూస్తున్నాడు. చెల్లెలివైపుతిరిగి చిరునవ్వునవ్వి తన గదిలోకి వెళ్ళిపోయాడు. అన్నయిష్టమేమోగాని శైలకు రాధనచ్చింది. ఆమె స్థిరత్వము శైలను ఆకర్షించింది.

ఈ ఆరుగురిలో ఏ ఒక్కరో తేలిపోతే బాగుండును. గాని ముగ్గురు తేలారు. కాస్తంత విషయాన్నిగూడా భరించలేకుండా అగ్గిగుగ్గిలము అయిపోయారు లక్ష్మి, కమల ఇటువంటి వాళ్ళతో జీవితము గడపచూసుకొవడము తెలవితక్కువ. తనపై నాళ్లకు

అభిమానము లేకపోలేదు. ఉంది. గాని అది తాను తిన్నగా ఉన్నంతవరకే. ఇక స్వర్ణ .... "రెస్కెల్ ...." వళ్లు కొరికాడు. ఇన్నాళ్ల అభిమానము ఒక్క క్షణములో ఎగిరిపోయింది. కనీసము సానుభూతి చూపపలసిన అవుసరము కూడ, అధమం లోకాచారముగానైనా లేకపోయింది. బీస్ట్. ఇకముగ్గురు.

మాలతిది వెర్రిప్రేమ. అపారం. పద్మది స్వార్థాన్ని లెక్కచేయని ప్రేమ. అద్వితీయము. ఇకరాధ నిశ్చల ధైర్య స్థైర్యప్రేమ అనంతం. ఎవరికెవరూ తీసిపోరు. ఈ ముగ్గురిలో ఎవరూ....? అనడానికైనా....! ఏ ఇద్దరినీ కాదన డానికి వీలులేకుండా ఉంది.

సాయంకాలం అలా అందర్నీ చూచి వద్దామని బయల్దేరాడు. ఆ ఐదుగురు ఏమిచేస్తుంటారూ అని.

పద్మజ బ్రహ్మానందముతో స్వాగతము ఇచ్చింది. అతి తీయగా మాట్లాడింది. అల్పాహార పానీయాదులు స్వయముగా దగ్గరకూర్చుని సేవింపజేసింది. "అబ్బా పద్మ" అనుకున్నాడు.

కమల "ఏం? ఇంకా టెస్టులేమైనా మిగిలిపోయాయా" అంటూ పల్కరించింది. మ్రొక్కుబడికి రెండుమాటలాడీ లోనికెళ్లిపోయింది. మురళిలేచి బయల్దేరేసమయములో గాలిలా వచ్చింది. "మురళీ ఒక్కవిషయము, నేనే ఐననాడు పరవాలేదు. కాకపోయినా ఏమంత మించిపోయిందీ లేదు. గాని ఫలానా అనడానికి మీ టెస్టులో మీరు తేల్చుకున్నది సకారణంగా నిరూపించవలసిన బాధ్యత మీమీదఉంది. అది మాత్రము మర్చిపోకండి" అంది. "అలాగే" అనేసి వచ్చేసాడు.

లక్ష్మి పలకరించడానికి నిరాకరించింది. వరండాలోనున్నది చరాలున లోనికి వెళ్ళిపోయి, పనిమనిషిచేత "మళ్ళీ ఈ ఇంటిగుమ్మం తొక్కవద్దు" అని కబురుచేసింది.

రాధ యధాలాపముగా ఆహ్వానించింది. బాతాఖానీలోనికి దింపింది. తన రాకను దృఢముగా విశ్వసించినట్లు చెప్పింది. అమె సైకాలజీకి ఆశ్చర్యపోయెడు. "మురళీధరుడు రాధను మర్చిపోలేదు" అంటూ చమత్కరించింది. "మర్చిపోడు. అది అసంభవం"

"అదే ఆలోచిస్తున్నాను. ఇక్కడినుండి ఇంక సరాసరి ఇంటికిపోయి ఆలోచిస్తాను."

"అయితే ఇంతకుముందు ఎక్కడికైనా వెళ్లారా?"

"అవునురాధా. వరుసగా పద్మ, కమల, మాలతి, లక్ష్మి ఇళ్లదగ్గరనుంచి ఇలా వచ్చాను."

"వెరీగుడ్ చాలా మంచిపనేచేసారు. ఇక్కడనుండి తిన్నగా ఇంటికేగా?"

"అవును ఇంటికే పోతాను."

"నిజంగా స్వర్ణ పత్తాలేదు. ఆమె కిందులో వాటాలేదా?"

"ఉంది....గాని, లేనిది సానుభూతి మాత్రమే."

"అంటే....! మీరు స్వర్ణకుకూడ ఫోనుచేసారన్నమాట. చేసినా రాలేదు. చాలా ఆశ్చర్యము."

"ఉందిగా అచంచలత్వము అన్న పేరులో బ్రతిరిగుడు. మీ రిద్దరూ ఒక్కటే. ఐతే నీకు దయార్ద్రహృదయము ఉంది. గాభరామాత్రము పడవు. గాని పనులు చేస్తావు."

"అవుననుకోండి. మేమిద్దరం ఒకటే. ఏవిషయానికీ చలించం. గాని, ఇంకొక కబులు ఇంకొక కబురుగాదుగా. అనీ మీగురించి. హృదయము ఒక్కసారి గుభీమంది. అగినంత పనైంది. గాని కష్టం మీద తమాయించుకున్నాను. స్వర్ణ అంత కఠినురాలా!"

"అనుమానము అక్కరలేదు. ఇప్పుడు జ్ఞాపకమువస్తూంది. వాళ్ళ అమ్మమ్మ చనిపోయిందని టెలిగ్రాం వస్తే ఇంటంతా పరిగెత్తారు. గాని క్లాసులు పోతాయని స్వర్ణ ఉండిపోయింది. ఏమనిఅడిగితే చచ్చిపోయిందెలాగూ చచ్చిపోయింది. ఇప్పుడెవరం వెళ్లినా చేసేదేముంది? నే వెళ్లలేదని అంటున్నారుగాని, వెళ్ళిన మా అమ్మ నాన్నమాత్రం ఏమిటీచేస్తారు? అంచేత పరీక్షలైపోగానే సెలవుల్లో వెళ్లి నాలుగు రోజులుంటి వస్తాను. అలికగా అనేసింది. నేను ఫోనుచేసిందిగూడా, అదే తీరుబాటుగా వెళ్లవచ్చులే అంటూ ఉండిపోయింది.

"అవునండోయ్ నిజంగా. దానికసలు ఎవరిచావన్నా, హు....ఎలాగూ చచ్చిపోయారు ఇంక ఏడ్చి నెత్తి మొత్తుకుంటే ఉందా? అని అంటుంది. కాస్తలో నా ఉద్దేశము అదే ఐనా ఒకసారి చూడాలనిపిస్తుంది?

"దానికి చావంటే చీమకుట్టినట్టుండదు. కనీసం తన చావునాడైనా చలిస్తుందో లేదో?!"

"పోనీ, ఇందరిళ్ళకూ ఎలాగూ వచ్చారు, దాన్నిగూడ చూసేయండి ఒకసారి. తమాషాగా ఉంటుంది"

"ఛీ స్కౌండ్రల్ దానింటికెళ్లేదేంటి?"


"అదికాదు ఫార్మల్‌గా ఒకసారి. కాగా అది రాకపోయినా, మీరువెళ్తే గమ్మత్తుగా ఉంటుంది. చిత్తుచేసినట్టౌతుంది. అంచేత మీరు ఖచ్చితంగా వెళ్ళాలి.

"అయితే....అలాగేకానీ" అంటూ బయల్దేరాడు.

ఇష్టములేకుండానే స్వర్ణకుమారి ఇంటికి చేరుకున్నాడు. ఆయిల్లు చాలా హడావిడిగా ఉంది. పైన ఐదారుకార్లు ఆగివున్నాయి. మనుషులు లోనికి పైకీ ఏదో హడావుడిగా తిరుగుచున్నారు. ఏదో టీపార్టీ అయివుంటుంది. ఇందులో పడి మరి రాలేదు. "హు...."

సరే సంగతేమిటో కనుక్కుందామని లోపలినుంచి వస్తున్న ఒకతనిని అడిగాడు. అతను చాలా దీనంగా "పాపం ఇంజనీరుగారమ్మాయికి పొద్దుటనుంచీ తెలివిరాలేదు" అన్నాడు. మురళి తృళ్లిపడ్డాడు. "అరరె....ఏమైందండీ" అన్నాడు. "అ....ఏదో....ఫోనుకాలు వచ్చిందటండీ ప్రొద్దున్న. అయితే! పెద్ద కేకవేసి పడిపోయింది...." చెప్పూకుపోతున్నాడు. మురళికి ప్రపంచము చక్రాకారముగా తిరుగుతుంది. ఎవరిగురించైనా కించిత్తు ఫీలవని స్వర్ణ, తన మరణవార్తకు ఇంతలా ఐపోవడమా! ఆశ్చర్యం అంతుపట్టలేదు. తను లేకపోతే జీవితమే లేదన్నదానికి అర్థము ఇదా....? ఇందుచేతనేనా చూడడానికి రాలేదు. తల తిరిగిపోతూంది.

"ఆ మురళిని తీసుకరావాలండీ ఎలాగైనా" తృళ్ళిపడ్డాడు. కారు అవతల డాక్టరు స్వర్ణ పెదతండ్రి. "లాభం లేదండి. నేనుండి చేయగలిగిందేమీ



లేదు. జబ్బు కైతే మందివ్వగలను, ఏమైనా చేయగలను. గాని జబ్బేమీ లేదు. మురళి అంటూ కలవరిస్తోంది. అంతే ఆ మురళిని మీ రెలాగైనా సరే వెతికి తీసుకురావాలి. లేకపోతే....... ఈరాత్రి...."

మురళి హృదయము ఒక్కసారి ఆగిపోయింది. మిన్నువిరిగి మీదపడినట్టయింది. కర్తవ్య విమూఢుడైనాడు, జాగ్రదవస్థ లోపిస్తూంది.

"అవుననుకోండి. గాని అతను మనిషైతే తమ్ముడు వాళ్ళందరికీ తెలుసు. గాని అతనిల్లు ఎవరికీతెలీదు. ప్రొద్దుట నుంచీ కార్లు తిరుగున్నాయిగదా!"

"అదే! అతన్ని తీసుకవచ్చి నాకు ఫోన్‌చేయండి వస్తాను, అతను రాందీ నేను ఏమిచేయలేను. అదీ ఈ సాయంకాలములోపునైతేనే! మరొక్కమాట. ఆ ఫోన్‌కాల్ ఎవరుచేసారో కనుక్కోండి. ఏమనోకూడ. బహుశా అది ఆ మురళికి సంబంధించినదే అయివుంటుంది. మరి వస్తా" కారు స్టార్టుచేసాడు.

"డాక్టరుగారూ .... ఆగండి .... నేనే మురళిని, వచ్చాన" అంటూ లోపలికి పరిగెత్తాడు. వీళ్ళద్దరూగూడ కాలికొద్దీ అనుసరించారు.

నరాసరి మంచముమీద కూర్చుని నుదురుపై చేయివేసి "స్వర్ణా...." అన్నాడు. "మురళి...." అంటూ అతి హీనముగా కలవరిస్తూంది. కళ్ళంట నీళ్లు జారుతున్నాయి. అచేతనముగా ఉండిపోయాడు,

డాక్టరు సలహా ఇచ్చాడు. ఆమెను మెల్లిగా కుదుపుతూ "స్వర్ణా నేను మురళిని వచ్చాను" అంటూ చెవుదగ్గర చెప్పమని. అలా "స్వర్ణా" అంటూ పిలుస్తూనే ఉన్నాడు. ఆమెలో చలనం ఏమీకనుపించలేదు. "మురళీ" అంటూ ఉండి ఉండి కలవరిస్తోంది. అరగంట గడిచింది. బయట చీకటిపడింది మురళిగుండెలో రాయిపడింది. ఆశ సన్నగిల్లిపోయింది. ఐనా అలా పిలుస్తూనే ఉన్నాడు.

మురళీ పరీక్షకు సమాధానము దొరికింది. ఆమె హృదయములో ప్రపంచము అంతా ఒక ఎత్తు మురళీ ఒక ఎత్తు. మురళికి తన జీవితానికే బంధించింది. భగవంతునిపై భారమువేసి మానవప్రయత్నము చేస్తున్నాడు. మేన్ ప్రొపోజెస్‌గాడ్ డిస్పోజెస్.

స్వర్ణకుమారి జీవితసర్వస్వం ప్రేమమయం. అసలు మానవుడి జీవితమే ప్రేమమయం.

ఈ ప్రేమే తేనినాడు 'వందే శంభుముమాపతిం" అంటూ హిమాలయా లెక్కేసాడు. ఆఓపికా లేనివాడు ప్రపంచాన్ని వదిలేయడము ఆశ్చర్యకరమేమీగాదు.

అతి ప్రయాసమీద ఇంకొక అరగంటకి స్వర్ణ నెమ్మదిగా కళ్లువిప్పింది. మురళి ఉత్సాహముగా "నేను మురళిని వచ్చాను" అన్నాడు. "మురళీ మీరా ఫోను" "అదేమీలేదు. స్వర్ణా నేను మురళినే" అన్నాడు. స్వర్ణ పూర్తిగా కళ్ళువిప్పింది. మురళి చేతులను తన చేతులలోనికి తీసుకుంది. మురళి తన అధారముగా స్వర్ణని కూర్చోబెట్టాడు. డాక్టరు అవుసరములేకుండానే మురళి సాయముతో లేచి నీరసం తీర్చుకుంటుంది.

నెలరోజులు తిరిగాయి. మురళీధర, స్వర్ణకుమారి వివాహానికి మిగిలిన ఐదు గురూ హాజరైనారు. పెళ్లిపెద్దలై స్వయముగా నడుముకట్టారు.

ఈ పెళ్ళి సుఖముగా జరిగి, ఘట్టము సుఖాంతము కావడానికి మూలకారకురాలు రాధ అంటాడు మురళి. రాధ తనకు నూత్న జీవిత వికాసప్రధాని అంటుంది స్వర్ణ. ★